ప్రతిపౌరుడు రక్తదానం చేయాలి

- సీనియర్ సివిల్‌జడ్జీ పద్మావతి
- బార్ కార్యదర్శికి ప్రశంసాపత్రం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పదిసార్లు రక్తదానం చేసిన నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది భాగీ చరణ్‌కు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి ప్రశంసాపత్రం అందజేశారు. సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... ఆరోగ్యవంతుడైన ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని కోరారు. న్యాయసేవ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సహకరించాలని,10 జూన్ న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కు సంపూర్ణ మద్దతు కూడగట్టుకొని న్యాయఫలాలు న్యాయార్థులకు అందిద్దామని ఆమె బార్ అధ్యక్షుడు దేవదాసు తో అన్నారు. బార్ ఎల్లవేళలా సంస్థ కార్యాక్రమాల్లో పాల్గొని సహకరిస్తున్న విధానాన్ని తెలిపారు.

సదాశివనగర్ సీఐకి అవార్డు



నవతెలంగాణ-సదాశివనగర్

సురక్ష దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న సదాశివనగర్ సీఐ రామన్‌కు రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కామారెడ్డి జిల్లాలోని కళాభారతిలో సురక్ష దినోత్సవం నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కాగా సీఐ అవార్డు అందుకున్నారు.

ఉద్యమాల ద్వారానే

ఇండ్ల స్థలాలు సాధిస్తాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు
- పేదలతో కలిసి కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా



ర్యాలీగా వెళ్తున్న పేదలు, సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉద్యమాల ద్వారానే ఇండ్ల స్థలాలు సాధిస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో నిర్వహిస్తున్న ఇండ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్న ప్రజలు దుబ్బ ప్రాంతంలోని భూ పోరాట కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. 'ఇండ్ల స్థలాలు ఇవ్వాలి' అంటూ నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌ను హెూరెత్తించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ ప్రభుత్వానికి ప్రజలు చేసుకున్న దరఖాస్తులను నెత్తిన మోస్తూ, కలెక్టర్ చాంబర్‌కు తీసుకువెళ్లి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వందలాది దరఖాస్తులు, వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అక్కడ ప్రభుత్వ భూమిని తప్పకుండా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గుర్తించిన భూమిని పేద ప్రజలకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ శివారులో సర్వేనెంబర్ 171, 172లలో ఉన్న ప్రభుత్వ భూమిలో గత పది, పదిహేను రోజులుగా భగభగ మండే ఎండలో, నిన్న కురిసిన వర్షంలో సైతం చంటి బిడ్డలను ఎత్తుకొని ఎండకు ఎండుతూ, వానకు నానుతూ ఇళ్ల స్థలాల కోసం పేద ప్రజలు పోరాటం చేస్తున్నారని అన్నారు. మరోవైపు ప్రభుత్వ భూమిని అక్రమంగా కాజేసే పద్ధతుల్లో వ్యవహరిస్తున్న భూ బకాసూరులకు అండగా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం వ్యవహరించడం సరికాదని అన్నారు. ప్రజల పక్షాన నిలవాల్సిన అధికారులు వారికి కొమ్ము కాయటం ఏంటని ప్రశ్నించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే ఇండ్ల స్థలాలను సాధిస్తామని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ 171 సర్వే నెంబర్‌లో 13 ఎకరాల 30 గుంటల అసైన్మెంట్ భూమి ఉందని అందులో 8 ఎకరాల ఐదు గుంటల భూమిని పంచాయతీరాజ్ టీచర్లకు కేటాయించారని, మిగిలిన 5ఎకరాల 30 గుంటల భూమిని భూ కబ్జాదారులు కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. అదే స్థలంలో నిరుపేదలు గుడిసెలు వేస్తే మాత్రం తొలగించాలని భయభ్రాంతులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు భూ బకాసురులను నిలువరించి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి పెద్ది సూరి, జిల్లా కమిటీ సభ్యురాలు బెజగం సుజాత, నగర కమిటీ సభ్యులు ధ్యారంగుల కృష్ణ, షేక్ అబ్దుల్, కటారి రాములు, నల్వాల నరసయ్య, బొప్పిడి అనసూజ, మహేష్, లావణ్య కళావతి, భూపోరాటం నాయకులు శ్రీధర్, ఇమామ్, రాము, నిలీమ, లింబాద్రి, రహమత్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు



కలెక్టరేట్ వద్ద సీపీఐ(ఎం) నాయకులు

తెలంగాణలో

నాణ్యమైన విద్యుత్

- 24 గంటల విద్యుత్ సరఫరా దేశంలోనే ఆదర్శం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బాన్సువాడ)



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

'తొమ్మిదేండ్ల స్వల్పకాలంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని విశ్లేషించుకుంటే మనం సాధించిన ఘన విజయాలెన్నో కండ్లముందు సాక్షాత్కరిస్తాయి. 75 సంవత్సరాలలో దేశంలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను తొమ్మిదేండ్లలో తెలంగాణ సాధించింది' అని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బాన్సువాడ నియోజకవర్గం విద్యుత్ ప్రగతి దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ రాష్ట్రం అవతరించే నాటికి, నేటి స్థితిగతులకు అసలు పోలికే లేదన్నది జగమెరిగిన సత్యం. ఆర్థికవృద్ధిలో, తలసరి ఆదాయం పెరుగుదలలో, విద్యుత్తు సరఫరాలో, తాగునీరు, సాగునీటి సదుపాయంలో, ప్రజా సంక్షేమంలో, పారిశ్రామిక, ఐటీ రంగాల ప్రగతిలో ఇలా అనేక రంగాలలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలవడం మనందరికీ గర్వకారణం' అని స్పీకర్ అన్నారు. 2014లో తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 1196 యూనిట్లు కాగా, ప్రస్తుతం రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2140 యూనిట్లకు చేరిందని, ఇది జాతీయ సగటు 1255 యూనిట్ల కంటే 70 శాతం అధికమని తెలిపారు. రైతులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి ఉచితంగా కరంటు సరఫరా అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొత్తం 27.49 లక్షల వ్యవసాయ కరెంటు మోటార్లు ఉన్నాయని, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ కోసం ఏటా 12వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. అంటే ప్రతి రైతుకు రూ.40,000 సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో విద్యుత్ సబ్ స్టేషన్లు, సరఫరా కోసం 525 కోట్లు ఖర్చు చేశామన్నారు. దామరంచలో 70 కోట్ల రూపాయలతో 220 కేవీ, సబ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 43 వేల విద్యుత్ మోటార్లు ఉన్నాయని చెప్పారు. వీటి కోసం ఏటా సుమారుగా రూ.170కోట్ల సబ్సిడీగా ఖర్చు అవుతుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను సర్పంచ్‌లు ఫోటోలు, వీడియోలు తీసి ప్రజలకు వివరించాలని సూచించారు. గత పది సంవత్సరాల ప్రజా జీవితం నాకు సంతృప్తి ఇచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను అన్నింటినీ నెరవేర్చానన్నారు. కార్యక్రమంలో అదనప కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు డి.అంజిరెడ్డి, బాన్సువాడ పురపాలక సంఘం అధ్యక్షుడు జంగం గంగాధర్, ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్పీ జగన్నాధరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దినోత్సవానికి హాజరైన పలువురు

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ కళాశాలలో ఒత్తిడి లేకుండా, నాణ్యమైన విద్య అందుతుందని రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సిద్దయ్య, తిరుపతి అన్నారు. సోమవారం మండలంలోని మద్దికుంటలో కళాశాలలో అడ్మిషన్ల కోసం ప్రత్యేక కార్యక్రమంతో ఇంటింటికి తిరుగుతూ, ప్రభుత్వ కళాశాలలో వసతులు, విద్యా ప్రమాణాలపై వివరిస్తూ, ప్రభుత్వ కళాశాలలో తమ విద్యార్థులను చేర్పించాలని తలిదండ్రులకు సూచించారు.

గొల్లపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గణేష్ మాట్లాడుతూ.. బడీడు పిల్లలందరినీ, ప్రభుత్వ బడిలోకి పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య, రెండు జతల బట్టలు, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందజేస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని అన్నారు. గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి, సిఆర్‌పి మహమ్మద్, అంగన్వాడీ టీచర్ జ్యోతి తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఈటల

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్



లింగంపేట్‌లో ఈటలకు సన్మానం

మండలంలోని మీసానిపల్లి గ్రామంలో సోమవారం శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండ్ల రాజ్య లక్ష్మీ సాయిలు, ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైండ్ల పోచన్న, పైల కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు బతిని దేవేందర్, జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఈటల..

లింగంపేట్ : హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ ఆలయంలో ఈటల రాజేందర్‌ను, ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శబరి, బొల్లారం క్రాంతికుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు దాసరి అనిల్, శెట్పల్లి కాశీరం తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే షకీల్ భరోసా

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామానికి చెందిన ఇంద్రుల రవి అనే వ్యక్తికి కొన్ని రోజులుగా కిడ్నీ నొప్పులతో ఇబ్బందులు పడుతున్నాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో బీఆర్ఎస్ గ్రామ నాయకులు సోమవారం రవి సాధక బాధలను ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో మానవతా దృక్పథంతో సానుకూలంగా స్పందించిన బోధన్ ఎమ్మెల్యే షకీల్ బాధిత కుటుంబానికి రూ.లక్ష ఎల్ఓసి కాపీని అందజేశారు. పోచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాడెం ఇస్తారి, తాడెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో రైతుల్లో ఆనందం
- లలిత గార్డెన్‌లో విద్యుత్తు ప్రగతి సభ



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే శాంతి భద్రతలు, మౌలిక సదుపాయాలు ఎంత ముఖ్యమో విద్యుత్ రంగం కూడా అంతే ముఖ్యమని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. అభివృద్ధిలో ఎంతో కీలకమైన విద్యుత్తును ప్రజలు పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు. సోమవారం మండల కేంద్రం శివారులోని లలిత గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బాల్కొండ నియోజకవర్గంలో సాధించిన విద్యుత్ ప్రగతిపై నియోజకవర్గ స్థాయి ప్రగతి నివేదన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన అతి కొద్ది కాలంలోనే డిమాండ్లూరు అధిగమించి కేవలం పట్టణాలను కాకుండా పల్లెలోని గృహ వాణిజ్య పరిశ్రమ రంగాలకు నిరంతరంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్తును ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతితో రాష్ట్రంలో వ్యవసాయరంగం అభివృద్ధి కూడా జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 7778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ వినియోగం తెలంగాణ ఏర్పడిన తర్వాత 18 వేల మెగావాట్లకు పెరిగిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత విద్యుత్ రంగంలో తెలంగాణ ఎంతో పురోగతి సాధించిందన్నారు. అన్ని రంగాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. 24 గంటలు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా వెనుక ఎంతోమంది విద్యుత్ సిబ్బంది కృషి దాగుందని వారందరి కృషిని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యుత్ సిబ్బందికి ప్రగతి నివేదన సభ ద్వారా బాల్కొండ నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యుత్ కోసం బాల్కొండ నియోజకవర్గంలో ఉన్న 46వేల వ్యవసాయ కనెక్షన్లకు గాను ప్రభుత్వం సుమారు రూ.200 కోట్ల సబ్సిడీని భరిస్తుందన్నారు. రాష్ట్రంలో నాయి బ్రాహ్మణులకు, రజకులకు, ఎస్సీ, ఎస్టీలకు కూడా విద్యుత్‌పై ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు.

బాల్కొండ నియోజకవర్గంలో గృహ అవసరాల కోసం వినియోగించే విద్యుత్‌పై కూడా ప్రభుత్వం సుమారు రూ.400 కోట్లను సబ్సిడీ రూపంలో ఖర్చు చేస్తుందన్నారు. ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్తు ఇవ్వడం వల్ల రైతులు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. అభివృద్ధిలో ఇంత కీలకమైన విద్యుత్తును ప్రజలు ఎంతో పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సాధించిన విద్యుత్ ప్రగతి కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించారు. బాల్కొండ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కృషితో నిర్మాణం జరిగిన విద్యుత్ సబ్ స్టేషన్‌లు, పవర్ ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ వల్ల వ్యవసాయ రంగానికి జరుగుతున్న మేలు వివరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం, డీసీఓ సింహాచలం, ఆర్మూర్ ఏసిపి ప్రభాకర్‌రావు, ఎంపీపీలు లోలపు గౌతమి, శివలింగు శ్రీనివాస్, జడ్పిటిసిలు పెరుమండ్ల రాధా రాజాగౌడ్, గుల్లే రాజేశ్వర్, బద్దం రవి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్లు, గ్రామ కోఆర్డినేటర్లు, సింగిల్ విండో చైర్మన్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ట్రైయినీ కలెక్టర్

నవతెలంగాణ-సదాశివనగర్




కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, సివిల్ సప్లై డీఎం అభిషేక్‌సింగ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డిని కొనుగోలు ప్రక్రియలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నందుకు అభినందించారు. దానితోపాటు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రైతు వేదికలో రిలయన్స్ ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పాల్గొని పండ్ల మొక్కను నాటారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షులు బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధిరాములు, ఏఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సంకరి రాజలింగం, ఎంపిఓ సురేందర్ రెడ్డి, సీసీ లింగం, అంగన్వాడీ టీచర్లు, మహిళా బృందాలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లిలో ఒకరు అదృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్



మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన యాదయ్య (48) అదృశ్యమైనట్లు లింగంపేట ఎస్సై శంకర్ తెలిపారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి.. యాదయ్యకు ఇద్దరు కుమారులుండగా మొదటి కుమారుడు మల్లేశంకు సంవత్సరం క్రితం పెళ్లి జరిగింది. గత నెల రోజుల క్రితం భార్య గొడవ పడడంతో తల్లి గారింటికి వెళ్ళింది. భర్త వేధిస్తున్నాడని, కొడుతున్నాడని సదాశినగర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అక్కడ పోలీసులు భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇరువురు పెద్దల సమక్షంలో మాట్లాడుకుంటామని పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చారు. దీంతో యాదయ్య భార్య 'కొడుకు సంసారం చక్కదిద్దలేవని' యాదయ్యను మందలించడంతో ఆదివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కోసం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలోని 8వ వార్డులో సోమవారం నీటి కోసం నిరసన చేపట్టారు. నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ ఎదుట గంట పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ వార్డులో నీటి సమస్య ఉందని గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. సెక్రెటరీకి ఫోన్ చేస్తే తనకేం పట్టదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని వారు తెలిపారు. గ్రామంలోని సర్పంచ్ అందుబాటులో లేకపోవడం వల్లనే ఈ సమస్య నెలకొందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సర్పంచ్, సిబ్బంది స్పందించి 8వ వార్డులోని నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

పర్యావరణహిత మండలానికి కృషి చేయాలి

- ఎంపీడీవో వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పిట్లం

పర్యావరణహిత మండలం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద పర్యావరణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది వేడుకలలో భాగంగా పర్యావరణ నిమిత్తం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. హెూటళ్లు, పలు కిరాణా షాపులలో విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేసి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శివకుమార్, పంచాయతీ సెక్రెటరీ యాదగిరి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరు మృతి



నవతెలంగాణ-మోపాల్

మండలానికి చెందిన ఒకరు ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓవ్యక్తి మృతిచెందాడు. ఎస్సై మహేష్ వివరాల ప్రకారం..ఇందూరు సుదర్శన్(43) కామారెడ్డి జిల్లా గాంధారి మార్కెట్ కమిటీ లో సూపర్వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత కాలకృత్యాలకోసం ఊరచెరువుకు వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాకపోయేసరికి చుట్టుపక్కల ఎంత వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. అయితే ఉదయం ఊరి చెరువులో తేలియాడుతున్నాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు నీట మునిగి ఉండవచ్చని భార్య ఇందూరి రజిత ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



నవతెలంగాణ-ఏర్గట్ల

తొర్తి గ్రామానికి చెందిన ఈర్గాల అర్జున్ (37) తొర్తి వాగులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని చేపలు కోరుక్కు తినగా గుర్తుపట్టలేని స్థితిలోకి చేరుకున్నాడు. వివరాల్లోకి వెళితే తొర్తి గ్రామానికి చెందిన ఈర్గాల అర్జున్‌ది పేద కుటుంబం. మృతుడికి ఇద్దరు కూతుళ్ళు,ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబాన్ని పోషించడం కోసం తొర్తి జీపీలో కార్మికుడుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్యతో గొడవ అయిన అనంతరం ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోవడంతో ఈ నెల 2న మృతుని తమ్ముడు గణేష్ ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో తన అన్న కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. ఇంతలోనే సోమవారం సాయంత్రం అర్జున్ తొర్తి వాగులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- టీయూలో బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర జాక్ పిలుపు మేరకు తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు ఉపాధ్యాయులు సోమవారం టీయూలో ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ముందు ప్రారంభమై లా కాలేజ్ కంప్యూటర్ సైన్స్ బిల్డింగ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ నుండి మెయిన్ గేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామి రావు మాట్లాడుతూ.. జాక్ పిలుపుమేరకు ఈ ర్యాలీ 12 యూనివర్సిటీల్లో చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 1335 కాంట్రాక్టు ఉపాధ్యాయులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు డాక్టర్ శరత్, డాక్టర్ గోపిరాజ్, డాక్టర్ బి.ఆర్ నేత, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ రామేశ్వర్ రెడ్డి, డాక్టర్ గంగ కిషన్, డాక్టర్ డానియల్, డాక్టర్ సురేష్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ దేవరాజ్ శ్రీనివాస్, డాక్టర్ జలంధర్, సందీప్, రాజేశ్వర్, పురుషోత్తం, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ ఆనంద్, డాక్టర్ నరసింహులు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ జి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టు ప్రజలందరినీ రెగ్యులరైజ్ చేసే వరకు ఆందోళనలు చేస్తామని అన్నారు. రేపటి ఉద్యమంలో భాగంగా పోస్ట్ కార్డు చీఫ్ మినిస్టర్ ఉంటుందని తెలిపారు.

మంత్రి ని కలిసిన జాక్ ప్రతినిధులు..

ప్రొఫెసర్ పరశురాం అధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ లో ఉన్నత విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సాధ్యమైనంత మెరకు త్వరలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రాసెస్ ని స్పీడప్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఉస్మానియా జాక్ చైర్మన్ తోపాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఉన్న ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో యంత్రాల ప్రవేశం వల్ల పనులు కోల్పోయి బ్రతకడం కష్టంగా మారిన వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి 2005లో ఉపాధి హామీ చట్టాన్ని సాధించుకుందన్నారు. అన్ని ధరలు పెరుగుతున్నా ఉపాధి కూలీల వేతనాలు మాత్రం పెరగట్లేదన్నారు. రోజుకు 60 రూపాయల నుండి 100 రూపాయలు మించి రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సంవత్సరం గత సంవత్సరం కంటే 25 వేల కోట్లు తగ్గించిందన్నారు. అంటే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్ర కనిపిస్తుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ... 2023 - 2024 బడ్జెట్లో 2లక్షల40వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం దేశ వ్యాప్తంగా ఆందోళన చేసిందన్నారు. మస్టర్లు, పేస్లిప్పుల విషయంలో అవకతవకలకు గురిచేస్తున్నారన్నారు. 200 రోజులు పని దినాలకు పెంచుతూ రోజువారి కూలీ ఎలాంటి ఆంక్షలు లేకుండా 600 రూపాయలు ఇవ్వాలని, కూలి డబ్బులు వారాంతంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం 5 లక్షలు ఇవ్వాలని, ఎండ తీవ్రతను తట్టుకోవడానికి పనులవద్ద టెంట్లు వేయాలని, పిల్లలని పట్టుకోవడానికి ఆయాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. లేదంటే ఐదు లీటర్ల మంచినీటి కిట్లను ఇవ్వాలని, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ పాకెట్లు ఇవ్వాని, అన్ని రకాల పనిముట్లు అందించాలని, గడ్డపారలకు పదును పెట్టుకోవడానికి సరిపడ ఖర్చులివ్వాలి. ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలం ఇచ్చి., ఇల్లు నిర్మించు కోవడానికి 10 లక్షల రూపాయలు ఉచిత ఇంటి రుణం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలలో నివాసం ఉంటున్న వారికి ఇంటి పట్టాలిచ్చి నిర్మాణానికి ఉచిత రుణ సదుపాయం ఇవ్వాలని,. చదువుకు దూరమవుతున్న ఈ అభాగ్యుల పిల్లలకు ప్రభుత్వమే విధిగా ఉన్నత చదువులు చదివించాలని, పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు, పని అడిగిన ప్రతి ఒక్కరికి పని ఇవ్వాలని, పని ఇవ్వలేకపోతె సగం కూలి చెల్లించాలని, పట్టణాలలో కూడా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు ఏశాల గంగాధర్, పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యులు గోళం లక్ష్మి, గోవర్ధన్, లక్ష్మీనర్సయ్య, నర్ర కళ, సాయిలు, షికారి శీను, జానకంపేట లక్ష్మి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పార్టీలతో సంబంధం లేకుండా సాయం చేస్తా

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- రేణుక మాత గుడి నిర్మాణానికి శంకుస్థాపన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా మాధవ నగర్ పరిధిలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రేణుకా మాత ఎల్లమ్మ గుడిని బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుడికోసం 10 లక్షల రూపాయలు మంజూరు చేసినట్టు తెలిపారు. మాధవ్ నగర్ పరిధిలో శ్మశాన వాటికకు 10 లక్షలు, చెరువు డెవలప్మెంట్‌కు 25 లక్షలు, విలేజ్ డెవలప్మెంట్‌కు దాదాపుగా అన్ని కలిపి రెండు కోట్ల రూపాయల వరకు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా తన దగ్గరకు వచ్చిన ప్రతి వ్యక్తికి తన సహాయపడతానని ఆయన తెలిపారు. రూరల్ లోనే అత్యధికంగా సీఎం ఆర్ చెక్కులను దాదాపు 24 కోట్ల రూపాయలు అందజేశానని, నిజామాబాద్ జిల్లాలోని అత్యధికంగా అందజేసింది రూరల్ నియోజకవర్గమని అన్నారు. కమ్యూనిటీ హాల్‌ల కోసం తన నియోజకవర్గ నిధులనుండి 42 కోట్ల వరకు అందజేశానని, తనతోపాటు విజీ గౌడ్ తన ఎమ్మెల్సీ నిధులనుండి కూడా 12 కోట్ల రూపాయలను అందచేశారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు కెసిఆర్ అప్పులు చేస్తున్నారని అంటున్నారని, కేసీఆర్ అప్పులు చేసేది కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసమే తప్ప ఇంకో ఉద్దేశం లేదని అన్నారు. దేశంలోనే అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందిందంటే అది కేసీఆర్ విజన్ వల్లనే సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో ఒలంపిక్ సంగం జిల్లా ఉపాధ్యక్షులు మరియు జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్, ఐ డి సి ఎం ఎస్ చైర్మన్ సాంబారి మోహన్, మారయ్య గౌడ్, రూరల్ జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, రవీంద్రనాథ్ ఠాగూర్ ,శ్రీహరి రామ్ కిషన్, సత్యం గౌడ్, యాదలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

తను కన్న కల నిజమై.. కమ్మర్‌పల్లి వెలిగిపోతోంది

- రాష్ట్రమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- సెంట్రల్ లైటింగ్, డివైడర్ ప్రారంభం


మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తను కన్న కలలు నిజమై... కమ్మర్ పల్లి వెలుగు జిలుగులతో వెలిగిపోతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.5 కోట్లతో జాతీయ రహదారిని విస్తరించి ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్, డివైడర్ ను సోమవారం సాయంత్రం మంత్రి ప్రారంభించారు. ఈ మేరకు ఉప్లూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ స్విచ్ ఆన్ చేసి ఆయన ప్రారంభించారు. అంతకు ముందు హాస కొత్తూర్ చౌరస్తా వద్ద మహిళా సంఘాల సభ్యులు బోనాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. అక్కడ్డి నుండి ఉప్లూర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పనులు చేస్తున్నామన్నారు. ఎంపీ అరవింద్ కేంద్రం నుండి నిధులు తెచ్చి ఎన్ని కోటతో అభివృద్ధి చేశారో స్పష్టం చేయాలన్నారు. రోడ్డు విస్తరణ విషయంలో తన శక్తి మేరకు ప్రజలకు నష్టం జరగకుండా చూసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, జడ్పిటిసి సభ్యురాలు పెరుమాండ్ల రాధా రాజాగౌడ్, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం సామూహిక శ్రీమంతాలు

నవతెలంగాణ సిరికొండ

మండలంలోని తూంపల్లి, హస్ మ్యా నాయక్ తాండ, కొండాపూర్, కాశివాడి తాండ, సిరికొండ గ్రామాలలో సోమవారం చిన్న పిల్లలకి అక్షరాభ్యాసం గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు జరిపించినట్లు అంగన్వాడి సూపర్వైజర్ ప్రియదర్శిని తెలిపారు. కార్యక్రమంలో తూంపల్లి సర్పంచ్ పల్లె బాలమణి మల్లేష్, గర్భిణీ స్త్రీలు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పైడి రాకేష్ రెడ్డి భారీ వాహన ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పైడి రాకేష్ రెడ్డి బీజేపీ పార్టీలో చేరి మొట్టమొదటిసారిగా నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా భారీ వాహన ర్యాలీ నిర్వహించనున్నారు. డిచ్‌పల్లి నుండి మొదలై పెర్కిట్ ద్వారా పట్టణ అంబెద్కర్ చౌరస్తా మీదుగా ఆలూరు మండల కేంద్రం వరకు నిర్వహించనున్నారు. అక్కడినుండి నూతన డొంకేశ్వర్ మండలం ద్వారా నందిపేట్, మాక్లూర్ నుండి అంకాపూర్ గ్రామానికి చేరుకుంటుందని పైడి చారిటబుల్ ట్రస్ట్ వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్, జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ పాల్గొంటున్నట్టు నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా ఆపదలో మీకు అండగా ఉంటాను అంటూ ఆయన నిస్వార్థ సేవలకు నేడు జరిగే ర్యాలీకి నియోజకవర్గంలోని ప్రజలందరూ వచ్చేందుకు సిద్ధమవుతున్నారని నాయకులు తెలిపారు.

లేబర్ కార్డు ఉన్నవారు హెల్త్ క్యాంపు ఉపయోగించుకోవాలి

నవతెలంగాణ-భీంగల్


హెల్త్‌క్యాంపులో పాల్గొన్న కార్మికులు

న్యాక్, సీఎస్సీ హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో లో నిర్వహించే ఉచిత ఆరోగ్య శిబిరం లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత, కన్నె సురేందర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా కార్మిక, భవన నిర్మాణ రంగంలో లేబర్ కార్డు కలిగిన వారికోసం సోమవారం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. మొదటి రోజు 120 మంది లేబర్ కార్డు కలిగిన వారికి 50 రకాల ఉచిత పరీక్షలు నిర్వహించారు. న్యాక్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ఈ నెల 6 న కొనసాగుతుందని తెలిపారు. లేబర్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు వైద్యపరీక్షలు చేయించుకోవాలని నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ పులివెంట్ల శశికాంత్ కోరారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సూచినమేరకు శిబిరం ఏర్పాటుచేశామని బీంగల్ న్యాక్ సెంటర్ బాధ్యులు దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో శిక్షకుడు ఓంకార్, కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ గంగాధర్, సీఎస్సీ హెల్త్ కేర్ మేనేజర్ సంజు, క్యాంపు కోఆర్డినేటర్ ఖలీం, ల్యాబ్ టెక్నీషియన్లు శైలని, సరిత తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరు మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కారు ఢీకొని ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కమ్మర్పల్లి మండల కేంద్రానికి చెందిన ఎర్రన్న (47) కుటుంబీకుల ఖాళీ సీసాలు ఏరుకొని జీవిస్తున్నారు. ఆర్మూర్‌లో గత నెల రోజుల నుంచి నివసిస్తున్నారు. సోమవారం ఎర్రన్న తన భార్య లక్ష్మి జక్రాన్ పల్లి మండలం అర్గుల్ గ్రామానికి పనికోసం వచ్చారు. తిరిగి ఆర్మూర్ వెళ్తున్న క్రమంలో టీవీఎస్‌పైన ఉన్న బట్టల మూట పడిపోయింది. భార్యను మామిడిపల్లిలోని వెంకటేశ్వర కాలనీలో ఇంటి వద్ద దింపేసి తిరిగి బట్టల మూట వెతకడానికి అర్గుల్ గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి వెళ్తున్న కారు ఢీకొనడంతో ఎర్రన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రన్నకు కుమారుడు ఉన్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

24 గంటల విద్యుత్తును అందిస్తున్న ఏకైక రాష్ట్రం

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే

కందిళ్లు, బిజిలీలు, లాంతర్ల నుంచి 24 గంటల విద్యుత్తును అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఎదిగిందని అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం విద్యుత్ ప్రగతి ఉత్సవ కార్యక్రమాన్ని అర్బన్ నియోజకవర్గం పరిధిలో పవర్ హౌస్ కాంపౌండ్‌లోని గోల్డెన్ జూబ్లీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే, మేయర్ దండు నీతు కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అన్యాయం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్‌లో సాధించిన ప్రగతి, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషి వీడియో ద్వారా ప్రదర్శించారు. ధూమ్ ధామ్ కార్యక్రమంలో అమరవీరులకు నివాళు లర్పించే గేయాలు, విద్యుత్ ఉద్యోగులు, సీఎం కేసీఆర్‌కు ఎలక్ట్రిసిటీపైన ఉన్న శ్రద్ధను చెబుతూ నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా మాట్లాడుతూ.. 24గంటల విద్యుత్తును అందిస్తున్న ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందని చెప్పారు, నేడు ఇన్వర్టర్లు, జనరేటర్లతో పనిలేకుండా పోయిందని, ఐటీ కంపెనీలు పెద్ద ఇండస్ట్రీలు రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిని చూసి హైదరాబాద్ వస్తున్నాయని చెప్పారు. మేయర్ దండు నీతూ కిరణ్ మాట్లాడుతూ సీఎం ఉదయం టిఫిన్ చేసినప్పటి నుండి రాత్రి భోజనం చేసే వరకు విద్యుత్ పరిస్థితిని తెలుసుకొనే తింటారని, కేసీఆర్ కు తెలంగాణ ప్రగతి పై ఉన్నటువంటి శ్రద్ధ అని కొనియాడారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుధాం లక్ష్మీ మహిళా కమిషన్ సభ్యులు, టిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ సిర్ప రాజు, డిఈ ఎం.శ్రీనివాస్ రావు, ప్రోగ్రాం కన్వీనర్ డీఈలు రాజేశ్వరరావు, వెంకటరమణ, నగర కార్పొరేటర్లు, విద్యుత్ శాఖ అధికారులు విరేశం, గంగారాం నాయక్, రవి కిషోర్, రఘునందన్, శివాజీ గణేష్, జాకీర్ అలీ సాబ్, డి.శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మనిషి జీవితంలో అంతర్భాగం చెట్లు

- జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్



ర్యాలీలో పాల్గొన్న జిల్లా జడ్జీలు, తదితరులు

మొక్కలే మహావృక్షాలై మానవ సంబంధాలను పెనవేస్తున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల తెలిపారు. న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాకోర్టు ఆవరణలో మొక్కలను నాటిన అనంతరం ఆమె మాట్లాడారు. మనుషుల జీవితంలో మొక్కలు, చెట్లు అంతర్భాగమని అన్నారు. కొన్ని చెట్ల నుండి లభించే పండ్లు మానవునికి ఆహారాన్ని అందిస్తున్నాయని తద్వారా ఎన్నో పోషకాలు లభించి మానవ మనుగడకు తోడ్పాడుతున్నాయని పేర్కొన్నారు. పూలు పూజలకు, శుభ కార్యక్రమాలకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. చెట్లతో ఆక్సిజన్ లభిస్తుందని, మానవ పరిణామక్రమంలో చెట్లకు ఉన్న ప్రాధాన్యత వెల కట్టలేనిదని తెలిపారు. ఏ రకంగా చూసిన చెట్లు, మొక్కలు మానవ జీవితాలతో విడదీయలేనివని అన్నారు. చెట్లను రక్షించడం, మొక్కలను నాటి పెంచడం చేయాలన్నారు. చెట్లను దేవుళ్లుగా కొలిచే ఆధ్యాత్మిక సంస్కృతి భారతీయుల జీవనవిధానంలో అంతర్భాగమని వెల్లడించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అనేది అందరు పవిత్ర కార్యక్రమంగా తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో ప్రతి పౌరుడు మొక్కలను నాటాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జిల్లాజడ్జి సునీత అన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లాజడ్జిలు కనకదుర్గ, శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బు ఉపాధ్యాయ, గోపికృష్ణ, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు, సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల భవన్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడారు. పర్యావరణ చట్టాలు, నిత్య జీవితంలో ఉపయోగపడే చట్టాలను తెలియజేశారు.

తొమ్మిదేళ్ల పాలనలో ప్రగతి పథంలో దేశం

- కేంద్రీయ విద్యాలయం సందర్శించిన బీజేపీ జాతీయ నాయకులు సునీల్ బన్సల్
- విశ్వవిద్యాలయానికి భూమి కేటాయింపుపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారు
- ఎంపీ ధర్మపురి అర్వింద్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కమ్మర్‌పల్లి

నగరంలోని ఖిల్లా ప్రాంతంలో నిర్మించిన కేంద్రీయ విద్యాలయాన్ని బీజేపీ జాతీయ నాయకులు సునీల్ బన్సల్ సోమవారం ఎంపీ అర్వింద్‌తో కలిసి సందర్శించారు. అనంతరం బన్సల్ విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోడీ పాలనలో దేశం ప్రగతి పథంలో ముందుకెళ్తోందని అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామని అన్నారు. రోడ్లు, ఐఐటీ లు, యూనివర్సిటీ లకు ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలపై స్పందించేందుకు బన్సల్ నిరాకరించారు. అనంతరం ఎంపీ అరవింద్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి 22 కోట్లతో సొంత భవనం నిర్మించామని, వెయ్యి మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. విశ్వవిద్యాలయానికి కేంద్రం నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం భూములు ఇవ్వడం లేదని ఆరోపించారు. భూమి కేటాయింపుపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని, భూములు ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి తీసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, పల్లె గంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కమ్మర్‌పల్లి: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలలో సాధించిన ప్రగతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో బిజెపి పార్టీ మహాజన్ సంపర్క్ అభియాన్ లో భాగంగా ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి శ సునీల్ బన్సల్, ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారులకు వచ్చాక వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు బూతు స్థాయి నుండి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పథకాలుగా గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బాల్కొండ నియోజకవర్గ బిజెపి నాయకులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గద్దే భూమన్న, బిజెపి జిల్లా ప్రభారీ వెంకటరమణి, పాపారావు, జగిత్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు మొరెపల్లి సత్యనారాయణ, బోధన్ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి, జగిత్యాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ : సునీల్ బన్సల్‌ను సన్మానిస్తున్న నాయకులు

9న సలాబత్‌పూర్ ఆలయ హుండీ లెక్కింపు

● ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్

నవతెలంగాణ-మద్నూర్
మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులో గల మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీని ఈనెల 9న శుక్రవారం ఉదయం 11 గంటలకు లెక్కించనున్నట్టు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి ఆలయ పాలకవర్గం సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

రికార్డుల అపహరణ



నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని భూంపల్లి గ్రామంలోని గ్రామ సమైక్యలో నుంచి రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి దొంగిలించినట్టు రెండు సంఘాల అధ్యక్షురాళ్లు నిర్మల, సరిత పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గ్రామ సమైక్యలో పనిచేసే సి.ఏ చూడగా బీరువా తెరిచి ఉందని, ఇతర రికార్డులు చిందవందరగా ఉన్నాయని, ఏపీఎం రాజిరెడ్డికి, సీసీ రాములుకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ఏపీడీ మురళికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమైక్యలో ఆర్థిక లావాదేవీల పుస్తకాలు, ఆడిట్ బుక్స్, ఓచర్ బిల్లులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్టు తెలిపారు.

కేసీఆర్ న్యూట్రిషన్ కిట్టు గర్భిణీలకు ఎంతో దోహదం

● వైద్యాధికారి రాజ్‌కుమార్



న్యూట్రిషన్ కిట్టుపై అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి
కేసీఆర్ న్యూట్రిషన్ కిట్టు గర్భిణులకు ఎంతో దోహదపడుతుందని మోస్రా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఎడపల్లి మండల కంటి వెలుగు ఇన్చార్జ్ వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్టుపై గర్భిణీ మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ఆకుకూరలతో పాటు పోషక పదార్థాలను తప్పనిసరి తీసుకుంటే పుట్టబోయే బిడ్డ బంగారంలా ఉంటారని వైద్యులు గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, అంగన్వాడీ ఉపాధ్యాయులు బండ కళ్యాణి, అనురాధ, ఆశావర్కర్లు తాటి విజయ, సంతోష్‌గౌడ్, కుంట అనిత, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన విద్యార్థులకు సన్మానం



ఉత్తీర్ణులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్
ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తునికి వేణు మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకొని పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానించినట్టు తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, పంచాయతీ కార్యదర్శి సదాశివ్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు పంపిణీ



రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ రాజాగౌడ్

నవతెలంగాణ-భిక్కనూర్
మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో సొసైటీ కార్యాలయ ఆవరణలో సొసైటీ చైర్మన్ రాజాగౌడ్ రైతులకు జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు జీలుగా విత్తనాలను పంపిణీ చేస్తుందని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకువచ్చి విత్తనాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ విట్టల్, ఏఎంసీ వైస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, ఎంపీటీసీ సాయగౌడ్, సొసైటీ డైరెక్టర్లు, సీఈఓ మోహన్ గౌడ్, రైతులు, తదితరులున్నారు.

బడిబాటకు స్పందన



బాడి బాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్
జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు బీర్కూర్ మండలంలోని దామరాంచ, బైరపూర్ గ్రామాల్లో పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కరపత్రాలు పంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల కృషితో మొదటి రోజు 18 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మన ఊరు-మన బడి ద్వారా పాఠశాలలో వచ్చిన మార్పు ఆహ్లాదకర వాతావరణం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారనే మంచి విద్యా అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల జీవితాల్లో వెలుగులు

● ఎమ్మెల్యే షకీల్ ఆమేర్



బోధన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి
రైతుల జీవితాలలో వారి కష్ట సుఖాలను తీర్చి, వారి జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు సోమవారం బోధన్ పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో నిర్వహించిన విద్యుత్ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వస్తే రాష్ట్రం చీకటిమయం అవుతుందని, నక్సలిజం పెరుగుతుందని గతంలో ఎందరో ఆరోపణలు చేశారని, కానీ వారి మాటలకు భిన్నంగా నేడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో రాష్ట్రం సస్యశ్యామలమైందని అన్నారు. గతంలో కరెంటు కష్టాలతో రైతులు రాత్రి, పగలు పంటలకు నీరు పారించడానికి ఇబ్బందులు పడుతూ ప్రమాదాలతో చనిపోయే వారని నేడు ముఖ్యమంత్రి కృషితో రైతులకు 24 గంటల పాటు ఉచిత కరెంటు అందిస్తున్నామని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తు అందించడానికి బోధన్ నియోజకవర్గానికి 870 కోట్ల రూపాయలు సబ్సిడీ ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. అలాగే సంవత్సరానికి 200 కోట్ల రూపాయలు రైతుల కోసం చెల్లిస్తున్నామన్నారు. కరెంటు సౌకర్యంతోనే ప్రపంచంలో అతిపెద్దదైన కాలేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశామని, ఆ ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. మహారాష్ట్రలో విద్యుత్ సంక్షోభంతో సాగునీటికి, తాగునీటికి కరెంటు లేక రైతులు రోధిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా రైతులకు పంటబీమా, రైతుబీమా, రైతు పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ ముక్తార్, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంపీపీ బుద్దె సావిత్రి, జడ్పిటిసి లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ సాలుర షకీల్, ఎడపల్లి, నవీపేట్, రెంజల్ ఎంపీపీలు, మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, డిసిసిబి డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, నియోజకవర్గంలోని విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గోసంగి సంఘ నాయకులు..

బోధన్ నియోజకవర్గానికి చెందిన గోసంగి సంఘం నాయకులు సోమవారం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను కలిసి పలు సమస్యలపై విన్నవించారు. నియోజకవర్గంలో గోసంగి భవనాలను మంజూరి చేయాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించి గోసంగి సంఘం భవనాలను మంజూరి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షులు రాజేశ్ తెలిపారు. చెరువులో పడి ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల కుటుంబాలకు దళితబంధు ఇచ్చి ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపినట్లు వారు పేర్కొన్నారు. అర్హులైన గోసంగిలకు డబుల్ బెడ్ రూం, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, గోసంగి సంఘం భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గోసంగి జిల్లా ప్రధాన కార్యదర్శి రాసరి నరేష్, పత్రీ సురేష్, కళ్లెం గంగాధర్, పత్రీ వెంకటేష్, ఈర్నాల సాయిలు, డిగ్రీ గంగాధర్, బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు కొండపల్లి గంగాధర్, బోధన్ మండల అధ్యక్షులు కొండపల్లి నరేష్ నవీపేట్ మండల అధ్యక్షులు సదుల రాములు, ఎడపల్లి సాదుల వీరేశం, సాలూరా మండల నాయకులు రాజేందర్ గిరి, ప్రకాష్ గిరితో పాటు 50 మంది గోసంగి నాయకులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ మృతి బాధాకరం..

ఎడపల్లి : మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన పురం సాయిలు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు 15రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారాన్ని తెలుసుకున్న బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ షకీల్ అమీర్ బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. సాయిలు మృతికి గల వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సాయిలు కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, స్థానిక ఎంపిటిసి, బిఆర్ఎస్ ఎడపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంద సంజీవ్ కుమార్, సర్పంచ్ సాయిలు, తానాకలాన్ సర్పంచ్ పొల్డ భాస్కర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

తెలంగాణలో 24 గంటల కరెంట్

● శతాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్యే జాజాల సురేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
24 గంటల కరెంట్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. తెలంగాణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వీకేవీ ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ శాఖ వారు నిర్వహించిన శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్, అడిషనల్ కలెక్టర్ చంద్ర మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్ర మోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే శతాబ్ది ఉత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృషితో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులు ఉచిత కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ప్రతి పక్షాలు అభివృద్ధి చూసి ఓర్వలేకనే పని గట్టుకొని ఆరోపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎంపిపి మాధవి, జడ్పీటీసీ ఉషగౌడ్, విద్యుత్ డిఈ గణేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు



జుక్కల్ : అంగన్వాడీలో గర్భిణీకి సీమంతం చేస్తున్న టీచర్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/జుక్కల్
మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు పూలు పండ్లు సమర్పించారు. అదేవిధంగా గర్భిణి స్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లత, శ్వేత, దేవకారణ సంతోష, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : పోషణ అభియాన్‌లో భాగంగా జుక్కల్ మండల కేంద్రంలోని నాలుగు సెంటర్‌లలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఆయా సెంటర్ పరిధిలోని గర్భిణులకు సీమంతాలు నిర్వహించినట్టు టీచర్లు తెలిపారు. ఈ సందర్భంగా టీచర్లు చెంచకళ, హన్మవ్వ, సాయవ్వ మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పలు పోషకాలను వివరించారు. కార్యక్రమంలో టీచర్లతో పాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్ల ప్రజాధనం వృథా

● కాంగ్రెస్ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న దశాబ్ది ఉత్సవాలు ప్రజా ధనాన్ని వృథా చేయడం తప్ప ప్రజలకు ఉపయోగం ఏమి లేదని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు కాదు బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాలు లాగా ఉన్నాయని ఆరోపించారు. సోనియా గాంధీ తెలంగాణ బిడ్డలు ఆత్మబలిదానాలను చూసి చలించిపోయి ఈ రాష్ట్రాన్ని ఇస్తే ఇక్కడ రాబందుల పాలన జరుగుతుందని నీళ్ల నిధులు నియామకాల మీద ఈ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఈ రాష్ట్రంలో కాంట్రాక్టులు కమీషన్లతో దోచుకుతింటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం 1200 మంది విద్యార్థులు ఆత్మబలిదానాలైతే అన్ని వర్గాల ప్రజలు పోరాడితే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, కానీ ఈ కేసీఆర్ ఒక్కడే పోరాడితే తెలంగాణ రాలేదు అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి పది సంవత్సరాల అయినా తెలంగాణ రాష్ట్రంలో పేదల బతుకులు మారలేవన్నారు. అదేవిధంగా ఈ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను గొప్పగా ఎందుకు జరుపుతుందో తెలుపాలన్నారు. కావున రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసి, అదేవిధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి బహుమతిగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, నర్సింహులు, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యావికాసం



తాడ్వాయి : బాడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్/తాడ్వాయి
మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికి వెళ్లి విద్యార్థులను పాఠశాలలు చేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వికాసం విస్తరిస్తుందని అనుభవం, అర్హత కలిగిన బోధనా సిబ్బంది నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు విద్య అందించడంతో పాటు సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. బట్టీ చదువులకు స్వస్తి పలికి ప్రయోగాత్మక, గుణాత్మక విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. డిజిటల్ తరగతులు బోధిస్తున్నారన్నారు. విద్యార్థులతో ప్రాజెక్ట్ వర్క్ చేయిస్తూ విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. గ్రామస్తులు అందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, సిఆర్పి రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రిష్టాజివాడిలో 'జయ శంకర్-బడి బాట'..

తాడ్వాయి : తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు జయశంకర్ బడిబాట ఈ నెల 3నుంచి 9 వరకు కార్యక్రమంలో భాగంగా సోమవారం క్రిష్టాజివాడి గ్రామంలో నిర్వహించారు. స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ రవికాంత్ రావు, డీఈవో రాజుతో పాటు సెక్టోరల్ ఆఫీసర్స్ శ్రీపతి, వేణు శర్మ, జీసీడీవో ఉమారాణి, ఎంఈఓ రామస్వామి పాల్గొన్నారు. ఈ బృందంతో పాటు పాఠశాల హెడ్మాస్టర్ వేణుగోపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొని విలేజిలో ఇంటింటికి వెళ్లి ఎన్రోల్మెంట్ భాగంగా 6వ తరగతిలో 6గురు విద్యార్థులను అడ్మిషన్ చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూషణం, ఎంపీటీసీ శాంతాబాయి నారాయణరావు, ఎస్ఎంసీ చైర్మన్ బాలకిషన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బడిబాటలో డ్రాపవుట్ విద్యార్థుల గుర్తింపు..

బోధన్ : ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట కార్యక్రమంలో సోమవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో బడి మానేసిన ఇద్దరు 8వ తరగతి విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేరేలా వారికి బడిబాటలో కౌన్సెలింగ్ చేసినట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాకాసిపేట (జేసి) ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం నిర్వహించిన బడిబాటలో ఏడుగురు విద్యార్థులను నమోదు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, శ్రీనివాస్, శైలేశ్, జమీల్, మైత్రేయి పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న బిచ్కుంద సీఐ కృష్ణ



బిచ్కుంద సీఐ కృష్ణ

నవతెలంగాణ-బిచ్కుంద
నేరాల నివారణ, సమర్థవంతమైన విచారణ, ప్రోయాక్టివ్ పోలీసింగ్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ మొదలైన రక్షణ క్రియాత్మక రంగాలలో సాధించిన ప్రతిభ అధారంగా పలు ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బిచ్కుంద సీఐ కృష్ణ జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే చేతుల మీదుగా అవార్డు అందుకు న్నారు. 2015లో ఉమ్మడి జిల్లా లోని నిజామాబాద్ మూడవ టౌన్‌లో ఎస్ఐగా నిధులు నిర్వహి స్తున్న సమయంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఎస్ఐ అవా ర్డు అందు కోగా, 2019లో బిచ్కు ంద ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సమయంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఎస్సైగా అవార్డు అందుకున్నారు. బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో కష్టపడే వారికి కచ్చితంగా తగిన గుర్తింపు లభిస్తుందని, ప్రస్తుతం పోలీస్ శాఖ అమలు చేస్తున్న అన్ని రకాల సాంకేతికతను అర్థం చేసుకొని తగినట్లుగా బాధ్యతగా పని చేసి గుర్తింపుతో పాటు పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు ఆయా పార్టీల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం.. మొక్కలు నాటుదాం

● ఎంపీపీ పాల్త్య విఠల్



నసురుల్లాబాద్ : మొక్కలు నాటుతున్న ఎంపీపీ, పలువురు

నవతెలంగాణ-నసురుల్లాబాద్/ఎల్లారెడ్డి
ప్రస్తుతం ప్లాస్టిక్ భూతం పట్టిపీడిస్తుందని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ భూతాన్ని తరిమేందుకు సిద్ధంగా ఉండాలని నసురుల్లాబాద్ ఎంపీపీ పాల్త్య విఠల్ సూచించారు. సోమవారం నసురుల్లాబాద్ మండలంలోని సంగెం గ్రామంలో నెహ్రు యువ కేంద్రం, సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రోజురోజుకు పర్యావరణం కలుషితం అవుతుందని, మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అడ్డగోలుగా నిబంధనలకు విరుద్ధంగా పుట్టుకొస్తున్న ఫ్యాక్టరీలు ఒక వైపు, మహా అరణ్యాలనే అంతం చేస్తున్నారని, అందుకే ప్రకృతి వర్షాకాలంలో విపరీతంగా ఎండలు, ఎముకలు కొరికే చలి, రక్తం గడ్డ కట్టే చలి, మాడ పగిలేలా కొట్టే ఎండలు, వరదలు వస్తున్నాయని తెలిపారు. ఇకనైనా ప్రతి ఒక్కరూ మేలుకొని పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించాలని అన్నారు. కార్యక్రమంలో సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ కన్వీనర్ సునీల్ రాథోడ్, ఉపసర్పంచ్ సాయగౌడ్, సెక్రెటరీ అనిల్, గొల్ల సాయి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

ఎల్లారెడ్డి : రిలయన్స్ ఫౌండేషన్, మత్తమాల గ్రామ పంచాయతీ సంయుక్తంగా సోమవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో 300 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ సురేందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పర్యావరణాన్ని కాపాడాలని అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం సామూహిక ప్రతిజ్ఞ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి బాలరాజ్, జడ్పిటిసి ఉషా గౌడ్, సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ దావీదు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ఎంపీఓ ప్రకాష్, కార్యదర్శి అశోక్, ఏపిఎం, ఏపీవో, టిఏ, సిసి, ఫారెస్ట్ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రెన్యువల్ ఫ్రెష్ ఉపకార వేతనాలకోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

2022-2023 విద్యా సంవత్సరంలో జిల్లాలోని కళాశాలల్లో చదువుతున్న అర్హులైన యస్సీ, బిసి, యసి, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు రెనివల్, ఫ్రెష్ ఉపకారవేతనాల కోసం http://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ నందు ఆన్లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల తేదీని ఈనెల 11 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొనసాగుతున్న చేపూర్ రోడ్డు పనులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ రోడ్డు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని సర్పంచ్ ఇందూరు సాయన్న సోమవారం తెలిపారు. హైవే రోడ్డు నుండి గ్రామానికి ఆర్ఎంబి రోడ్డు నిర్మాణ పనులు చేయించిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ కవితకు గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల నర్సయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలి

నవతెలంగాణ-కమ్మర్పల్లి/ఆర్మూర్/వేల్పూర్

గ్రామంలో బడిడు పిల్లలను తప్పనిసరిగా తల్లిదండ్రులు బడికి పంపాలని సర్పంచ్ సక్కారం అశోక్ అన్నారు. తెలంగాణ విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని బషీరాబాద్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి బడిడు పిల్లల, చదువు మధ్యలో మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలను వివరించారు. ప్రాథమిక విద్య ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థులను ఉన్నత పాఠశాలలో పైతరగతి చేర్చుకోవడానికి విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని తప్పనిసరిగా ప్రభుత్వం పాఠశాలలోనే చదివించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన చదువుతోపాటు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, కొత్తూరు మహేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్

8 మంది విద్యార్థులు పాఠశాలలో చేరిక



వేల్పూర్

ఆర్మూర్: మండలంలోని మిర్దాపల్లి గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించి ఎనిమిది మంది విద్యార్థిని విద్యార్థులను ఆరవ తరగతిలో చేర్చుకున్నట్టు ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలో గల సౌకర్యాలను గురించి, పాఠశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధు వర్మ , ఎంపీటీసీ భూదేవి భూమన్న, ఉపాధ్యాయులు కే.నరేందర్,, సిహెచ్ జ్యోతి సాయన్న ఉమేందర్ తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్పల్లిలో..

మూడవరోజు బడిబాట

వేల్పూర్: పచ్చల నడుకుడలో మూడవరోజు బడిబాటలో భాగంగా గ్రామంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా 11 మంది విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే ఉచిత నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులకు ప్రభావితమైన తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన శిక్షణ పొందిన అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, కావున విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలో దొరుకుతుందని తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులు అందరు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లల్ని చదివించి ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బైరి రవి, వీడీసీ దుమల గంగారాం, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభాకర్, లింబాద్రి, స్వామి, గణేష్, విట్టల్ రవికుమార్, కళావతి, రమ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

- సిపిఐఎంఎల్ ప్రజాపంథా



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయిన సందర్భంగా ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి సోమవారం మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ బోధన్ డివిజన్ కార్యదర్శి డి రాజేశ్వర్ మాట్లాడుతూ ఆర్భాటాలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా ఎలా జరుపుకుంటారని అన్నారు. గడిచిన 10 సంవత్సరాలలో ప్రజాస్వామ్యాన్ని కేసీఆర్ ఖూనీ చేస్తూ విద్యార్థులు నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని అన్నారు. ఇప్పటికైనా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు, మూడు ఎకరాల భూమి, నిరుద్యోగులకు పదివేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంతా ఎడపల్లి, నవీపేట్ మండలాల సంయుక్త కార్యదర్శి గుమ్మల గంగాధర్, సాయిలు, రమేష్, చిన్ను భాయ్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

42.3 మి.మీ వర్షపాతం నమోదు

- వాతావరణశాఖ అధికారి ఆశిష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వారం రోజులుగా ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో భూమి చాలా వేడెక్కి నైరుతి రుతుపవనాల వైపు మళ్లడంతో భూమి కింది భాగంలో వేడెక్కడం ద్వారా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వర్షం కురిసిందని 42.3 మిల్లీమీటర్ల వర్షపాతం ఆదివారం నమోదయిందని నిజామాబాద్ వాతావరణ శాఖ అధికారి ఆశిష్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం వాతావరణం చల్లబడిందని, వాతావరణం ఇదేవిధంగా మూడు నాలుగు రోజులపాటు ఉంటుందని ఎండ నుండి ప్రస్తుతం ప్రజలు ఉపశమనం పొందవచ్చని తెలిపారు. ఇక ఉష్ణోగ్రతలు పెరగవని తగ్గుతూనే ఉంటాయని వారం రోజుల్లో కూడా 35 డిగ్రీల క్రిందికి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఒకవేళ ఈ వారంలోపు నైరుతి రుతుపవనాలు ఉత్తర దిశగా టచ్ అయితే వర్షాకాలం ప్రారంభమవుతుందని తెలిపారు.

11 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మార్చి 2023 లో జిపిఏ 7.0 కంటే ఎక్కువ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ చెందిన విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం కార్పొరేట్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి తదుపరి ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ నిచ్చుటకు అర్హత గల విద్యార్థులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేయడానికి ఈనెల 3నుండి 11 వరకు ఆన్లైన్ నందు ధరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ షెడ్యూల్డ్ కులాల. అభివృద్ధి శాఖ, హైదరాబాద్ వారు తెలిపారని నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వరకు నమోదు చేసుకొని విద్యార్థులు నమోదు చేసుకొనుటకు అర్హత గల ఎస్సీ, ఎస్టి, బీసి, మైనారిటీకి చెందిన విద్యార్థులు ఆన్లైన్ వెబ్సైట్లో http://telanganaepass.cgg.gov.in పొడిగించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు వారి మొబైల్ఫోన్కు సమాచారం ఇస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం సంబంధిత ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వెల్ఫేర్ కార్యాలయంలో ఈనెల 16, 17న హాజరు కావాలని పేర్కొన్నారు.

11న ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయండి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంజర భూమయ్య



మాట్లాడుతున్న కంజర భూమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్సిటీ

ఈనెల 11న కొత్తగూడెంలో జరిగే సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయండని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంజర భూమయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ప్రెస్మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 14 నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహించామన్నారు. ముగింపు సభ కొత్తగూడెంలోని ప్రకాశం గ్రౌండ్స్లో ఈ నెల 4న నిర్వహించాల్సి ఉన్నప్పటికీ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి, విద్యుత్ ప్రభుత్వ శాఖల బహిరంగ సభ మూలంగా ఈనెల 11 కు వాయిదా పడిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ బహిరంగ సభలో ప్రజలు, పార్టీ, ప్రజాసంఘాల శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రెస్మీట్లో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు వై.రాజిరెడ్డి, మరియు లక్ష్మణ్, మహేష్ పాల్గొన్నారు.

వాతావరణం కాలుష్యం కాకుండా చూడాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరేస్తున్న స్థానికులు

ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైతులు గాలి, నీరు, వాతావరణం కాలుష్యం కాకుండా చూడాలని అన్నారు. అనంతరం తొర్తి గ్రామంలోని నల్ల చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తను తొలగించారు. గ్రామంలో గల పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు డిఓ అఖిల, సీఎఫ్ చింత శ్రీనివాస్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి

- వీహెచ్పీఎస్

నవతెలంగాణ-నవీపేట్

వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల ఏడవ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వీహెచ్పీఎస్ నాయకులు కోరారు. మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ధర్నాకరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎస్పి మహాజన సోషలిస్ట్ పార్టీ బోధన నియోజకవర్గ కన్వీనర్ మాణిక్యాల గంగాధర్ మాట్లాడుతూ.. ఈనెల 7న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, వికలాంగులకు 6000 పింఛన్, రోస్టర్ పాయింట్లను 10లోపు చేయాలని, వికలాంగులకు ప్రత్యేక సంక్షేమ శాఖను స్వతంత్రంగా ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 34 ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ తో ధర్నా కార్యక్రమం ఉంటుందని అన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు జిజి కాలేజ్ ఆడిటోరియంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పి మండల కన్వీనర్ ఆకారం రమేష్, సతీష్, పోశెట్టి, సంతోష్, సాయిలు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అవిష్కరిస్తున్న నాయకులు

ఓట్ల వేటలో పడి ప్రభుత్వ విద్యారంగాన్ని విస్మరించిన కేసీఆర్

నవతెలంగాణ-ఆర్మూర్

ఓట్ల వేటలో పడి ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి బాధ్యతను కెసిఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని పిడిఎస్యూ నాయకులు అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి ఎస్ యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలు సందర్భంగా సోమవారం పట్టణంలోని లోని ప్రజా పంథా పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్యూ ఆల్ ఇండియా యూనివర్సిటీల కో-ఆర్డినేటర్ ఎస్.నాగేశ్వర రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.సంధ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నదని అన్నారు. ఈవిద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్,డిగ్రీ కళాశాలలు, హాస్టల్స్, గురుకులాలు విశ్వవిద్యాలయాలలో కనీస వసతులు, విద్యా సౌకర్యాలు సమకూర్చడానికి ప్రత్యేక ఆర్థిక నిధులు కేటాయించాలనీ డిమాండ్ చేశారు. ప్రచార ఆర్భాటాలు పొందడానికి చేస్తున్న మన ఊరు,మన బడి లాంటి ఆకర్షణీయమైన పేపర్ పథకాలు పేదల విద్యను బాగుచేయడం లేదని అన్నారు. ఆచరణాత్మకంగా పనిచేసే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి కి, రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలని అన్నారు. ఓట్లు, సీట్లు పొందడానికి లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వ పెద్దలు, పేదలకు చదువు అదించే ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్లక్ష్యపూరితంగా విస్మరించడం, పోరాటాల ద్వారా సాధించిన రాష్ట్రంలో ఉండటం బాధాకరమని అన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలపై కనీస బాధ్యత లేని కారణంగా నిజామాబాద్లోని తెలంగాణ యూనివర్సిటీ సంక్షోభం విద్యార్థుల విద్యాసంవత్సరం ధ్వంసం చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తూ ఫీజులు దండుకుంటున్నాయని , వీటి పై ప్రభుత్వం దాగుడుమూతలు వ్యవహారం ఉన్నదని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం, కార్పొరేట్ ఫీజుల దోపిడీ రద్దు కోసం ప్రభుత్వం చిత్తుద్ధితో ఉండాలని అన్నారు. లేకుంటే భవిష్యత్ పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేందర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అఖిల్, రాష్ట్ర నాయకులు గణేష్, వెంకటేష్, అనిల్, అషుర్, దీపికా, సింహాద్రి, అజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

7న జిల్లాకు మందకృష్ణ మాదిగ రాక

- ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్
- అనుబంధ సంఘాల ఉమ్మడి జిల్లా సమావేశాన్ని విజయవంతం చెయ్యాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్/నవీపేట్

ఈనెల 7న జిల్లాకు మందకృష్ణ మాదిగ వస్తున్నారని, ఈసందర్భంగా ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఉమ్మడి జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు జూన్ 7న జరిగే కార్యక్రమాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనాథ ఆశ్రమాన్ని సందర్శించి అనాథలతో మాట్లాడుతారని, అనంతరం విహెచ్పిఎస్ అధ్వర్యంలో వికలాంగులకు 6000 పెన్షన్ పెంచాలని డిమాండ్తో జరిగే కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా లో మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. సాయంత్ర ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సమావేశం లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పి నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ గంధ మల్ల నాగభూషణం మాదిగ , ఎంఎస్పి నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ డల్ల సురేష్ మాదిగ , విహెచ్పిఎస్ జాతీయ నాయకురాలు సుజాత సూర్యవంశి , ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్ మాదిగ, ఎంఎస్వి జాతీయ నాయకులు మానికొల్ల గంగాధర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా సీనియర్ నాయకులు లసింగారి భూమన్న మాదిగ, జిల్లా నాయకులు రొడ్డ ప్రవీణ్ మాదిగ, ఎంఎస్పి నిజామాబాద్ జిల్లా టౌన్ నాయకులు శ్రీరాములు మాదిగ పాల్గొన్నారు.



కరపత్రాలు అవిష్కరిస్తున్న నాయకులు

ప్రతి డివిజన్లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం

- కాంగ్రెస్పార్టీ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ప్రతి డివిజన్లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కేశవేణు, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ భవన్లో నగర కాంగ్రెస్ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేశ వేణు మాట్లాడుతూ.. ఈనెల ఏడవ తేదీ నుండి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా నిజామాబాద్ నగరంలోని ప్రతి డివిజన్లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. గోల్ హనుమాన్ నుండి బొబ్బిలి విది,పోచమ్మ గల్లీ, ముదిరాజ్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించి ముదిరాజ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తామని ఆయన అన్నారు. ప్రతి గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని, గత పది సంవత్సరాలుగా బిజెపి, టీఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, పెట్రోల్ డీజిల్ నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను, నిరుద్యోగాన్ని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి మహిళలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ గాని, నిరుద్యోగ యువతకు నెలకు 4000 నిరుద్యోగ భృతి గాని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ , ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు, ఆరోగ్యశ్రీ ద్వారా ఐదు లక్షల రూపాయలు వైద్యం అందించడంపై ప్రజలకు వివరిస్తామని అన్నారు. పిసిసి ఉపాధ్యక్షులు తహేర్ బిన్ హం దన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో నిర్వహించే హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కష్టపడి పని చేస్తేనే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా యుత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్,రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి వీపుల్ గౌడ్, జిల్లా ఎన్ ఎస్ యు ఐ ఆధ్యాక్షులు వేణు రాజ్,పిసిసి కార్యదర్శి రం బూపల్,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నరేందర్ గౌడ్,పిసిసి మెంబర్ ఈసా,జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావేద్ అక్రమ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కేశ, అబుద్ బిన్ హందన్,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ,సేవాదళ్ సంతోష్,నగర మైనారిటీ చైర్మన్ ఎజాజ్,నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్, కేశ సాయి బాబా,నవాజ్, అయ్యుబ్,ప్రవీణ్, దేవి,మధు తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పైపులు, ఫిల్టర్లు దహనం

పోలీసులకు బాధితుని ఫిర్యాదు

నవతెలంగాణ-కమ్మర్పల్లి

మండలంలోని ఉప్లూర్లో వ్యవసాయ తోటలో డ్రిప్ పైపులు, ఫిల్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని గ్రామానికి చెందిన ఆర పేట పెద్ద అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలువ కింద వ్యవసాయ తోటలోని నాలుగు ఎకరాల్లో ఉన్న డ్రిప్ పైపులను ఫిల్టర్లను అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కక్షపూరితంగా కాల్చివేశారని బాధితుడు అంజయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. నాలుగు ఎకరాల్లో డ్రిప్ పైపులు ఫిల్టర్లు కాలిపోవడంతో లక్షల్లో నష్టం జరిగినట్లు బాధితుడు అంజయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బాధితుని వ్యవసాయ తోటను సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పీపేర అనిల్, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ సందర్శించి పరిశీలించారు.

8న వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రెడ్క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనె 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జూన్ 8న గురువారం బాలభవన్లో పిల్లలకు వ్యాస రచన చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా శాఖ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సభ్యులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.